# 24. పాఠం

నన్ను ప్రేమించి తమంతట తాము నన్ను ఆహ్వానించిన స్త్రీలు నా గడిచిన జీవితంలో అసలు లేరనే చెప్పొచ్చు. ఇందుకు మొదటి కారణం నేను అందమైనవాణ్ని కాకపోవటం. అందుకనే నా చిన్నతనంలో – ప్రైవేటు మాస్టారి బెత్తానికి నావీపంటే మహాఇష్టంగా వుండేది. నేను పిల్లాణ్నిగా ఉన్నప్పుడుకూడా నన్ను ఎత్తుకొని ముద్దుపెట్టుకొన్న స్త్రీలు చాలా తక్కువమందేనని మాఅమ్మ చెప్పేది. ఒకరి పరామర్శకేం గాని, అద్దంలోని నా ప్రతిబింబమే నా సౌందర్యాన్ని గూర్చి నాకు చెప్తోంది. (అద్దం సౌందర్యాన్ని కొలిచే పాత్ర, లేక మీటరూ కనుక.) రెండో కారణం అందరి కథకులంత అదృష్టవంతుణ్ణీ కాదునేను. కనుకనే – ఆ రాత్రి సంఘటన నాకు అతి విచిత్రంగానూ ఆశ్చర్యంగానూ తోచింది.

ఆనాడు సినిమాకు వెళ్ళినవాణ్ని – ఆడవాళ్ళకూ, మగవాళ్ళకూ మధ్య అడ్డంకట్టిన దడిపక్కనే వున్న కుర్చీలో కూర్చున్నా. నా పక్కనే వున్న బెంచీలో ఆమె కూర్చొని వుంది – ఎంత బావుందీ! అదేం ఖర్మమో కాని, ఆనాటి నా యువక నయనాలకు – అప్పటి యువతుల్లో నూటికి అరవై మంది బాగుండేవాళ్ళు. బహుశా నాలో లోపించిన సౌందర్యం వివిధ రూపాల్లో వారిలో మూర్తీభవించి వుండటమే దీనికి కారణమై వుంటుంది.

సినిమాకు వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను – ఆమె నిరాటంకంగా ఏదో ఆశను చూపుల్లో ఇముడ్చుకొని నావైపు చూస్తుంది – చిరునవ్వు నవ్వుతుంది! భూమండలంలో నేను నచ్చినట్టు సూచించిన స్త్రీ యీమె ఒక్కతే! నచ్చానా? ఏమో?

ఆ కట్టూ, జుట్టూ, బొట్టూ వీటినిపట్టి చూస్తే ఆమె ఓ కాలేజీగరల్ అయివుంటుం దనుకున్నా. ఎంత ఆస్తిపరురాలో - నన్ను వలచింది! గొప్ప కుటుంబ స్త్రీలచేత ప్రేమింపబడాలని ఇదివరకు ఎన్నో కమ్మని కలలు కన్నాను. కాని రొమాన్సు అంటే కథల్లో చదివినంత చులకన కాదని కూడా నాకు తెలుసు! ఏమైనా సినిమాదారి సినిమాది - నా దృష్టి దారి దడిమీంచి పాకి - ఆ గుడ్డి వెలుగులో కూర్చున్న ఆమె మీదికే పోయింది. ఈ గందరగోళంలో సినిమా కూడా ఐపోయింది - సినిమావాళ్ళకు ఇచ్చిన డబ్బు వృథా! ఆమె లేచి మెల్లిగా బైటికి వెళ్ళింది. కాసేపు రొమాన్సు చేశామనే సంతోషంతో సైకిల్ తీసుకొని నేనూ బైటపడ్డా.

నిద్రకళ్ళతో సైకిలెక్కా. కొంతదూరం వచ్చేప్పటికి నా ముందున్న జట్కాలో - ఇందాకటి యువతి ప్రత్యక్షమైంది. దాంతో నిద్రాదేవి ఛాయలన్నీ నా పైనుంచి తొలిగిపోయినై. ఆమె ముందు కూర్చున్న ఎనిమిదేళ్ళ కుర్రవాడొకడు నన్ను చూసి నవ్వుతున్నాడు. ఎలక్ట్రిక్ దీపపు వెలుగు బండిలో చొరుచుకున్న క్షణాల్ని నా కళ్ళు వృథా పోనివ్వటం లేదు - ఆమెను చూస్తున్న కొద్దీ - ఇదివరకు ఎక్కడోకాని ఆమెను చూసిన జ్ఞాపకం వస్తోంది - అది కలలోమాత్రం కాదు (అనిరుద్ధ అంశ నాలో లేదు గనుక) డొక్కు జట్కాను దాటిపోలేని సైకిల్ మీద - సిగరెట్ కాలి దాని వేడి నా వేళ్ళకు బాగా తగిలేటంతవరకూ నాకు తెలీకుండానే ఆమెను అనుసరిస్తున్నా.

రోడ్డు చీలింది. పక్క సందులోకి తిరిగింది జట్కా. నేను సరాసరి వెళ్దామను కుంటున్నా. కుర్రవాడు “రాం-డి” అని అరిచాడు. నేను తప్ప ఎవ్వరూ లేని రోడ్డు అది - ఆగి ఆశ్చర్యపోయి చూస్తున్నా.

ఈసారి తప్పట్లుకొట్టి “రాం-డి” అన్నాడు.

నిస్సందేహంగా నన్నే! ఈసారి నాకు తెలిసివుండే బండిని అనుసరించా - ఎందుకో? ఏమిటో? జట్కా సందు చివరి పూరిపాక ముందు నిల్చింది. నేను నాలుగు గజాల దూరంలో నిలబడ్డా.

“లోపలికి రండి” అంది ఆమె.

ఆశ్చర్యపోయా. అనేక సంశయాల్తో నా బుర్ర గిర్రున తిరిగింది. అర్ధరాత్రి సమయాన అపరిచితుణ్ని ఆహ్వానించటం! నూతన వాతావరణంలోకి వెళ్తే ప్రమాదమేమో? ఎదుట వున్న ఎలక్ట్రిక్ దీపపు వెలుగు ఆమె శరీరాన్నంతటినీ ఆక్రమించి ధన్యమౌతోంది! ఆమె చిరునవ్వుతో చెయ్యెత్తి ఆహ్వానిస్తోంది. ఒక అందాల భరిణెను ఆకర్షించ గలిగాననే అహంకారం నాలో పనిచేసింది. నీతీ, నియమమూ సంఘమూ - ఇవ్వాక మూల కునికిపాట్లు పడుతున్నాయ్. ఆమె కళ్ళు నాకు చూపే ఆశ! మంత్రముగ్ధుడిలాగు ఆమెను అనుసరించా - కుర్రవాడు ఏమైనాడో అంతులేదు - ఒక వైపున భయం పనిచేస్తోంది-

ఆమెతో లోన ప్రవేశించా. మకిల పట్టిన మట్టి గోడలూ, నలుచదరపు గదిలో ఒక మూల వాల్చివున్న నులకకుక్కీ, మరో మూల వున్న చింకి చాపా, మసి పట్టిన గ్లాసులోంచి గుడ్డివెలుగు వెదజిమ్ముతూన్న బెడ్ లైటూ - ఇంటి కప్పు లోంచి కనిపించే నీలాకాశమూ - ఇవ్విమాత్రం చూడగలిగా! ఆమె గొప్పఇంటి బిడ్డ అని భ్రమపడ్డా కాబోలు! ఈ పూరిపాకా, నులక్కుక్కీ యీమె ఆస్తి అని తెలిసినట్టయితే - ఇంతదూరం వచ్చేవాణ్ని కాదు. వేశ్యల ఇళ్ళకు ఇంతకుపూర్వం వెళ్ళకపోబట్టే ఎల్లా ప్రవర్తించాలో అర్థం కాక చూస్తున్నా.

ఆమె మూల నిలబడి కిలకిలా నవ్వుతోంది. - నన్ను తన వల్లోకి లాక్కొన్నాననన్న గర్వంచేతనేమో! ఏమైనా ఆమె నవ్వుతో ఆ చెత్త గదికి నూత్న శోభ వచ్చింది.

నులకకుక్కిని చూపింది -- అతిథికి ఆసనం అది! కూలబడ్డా. ఆమె నా దగ్గిరగా వచ్చి నిలబడ్డది. ఆమె ముఖంలోకి చూస్తూ ఆమె కళ్ళను పలకరిస్తున్నా.

కొన్ని క్షణాలపాటు ఇద్దరమూ నిశ్శబ్దదేవతను ఆరాధించాము.

మెల్లిగా ఆమె హస్తాన్ని పట్టుకొని, "నీ పేరేమిటి?" అన్నా.

"దుర్గాదేవి" అని నా పక్కనే కూలబడ్డది.

ఎక్కడో బాగా విన్న పేరే! గుర్తురావటంలేదు. ఎందుకొచ్చానా యీ బోనులోకి అనిపిస్తోంది. ఆమెను చూస్తూంటే రేకెత్తే ఆశలకూ, కోరికలకూ భయం వెనుకంజ వేస్తోంది.

నా భుజాలమీద ఆనుకొంది. ఆమె స్పర్శతో నా యువక రక్తం పొంగి పొర్లింది. ఉద్రేకంతో ఆమె కళ్ళల్లోకి చూశా - నవ్వింది! ఆ నవ్వే నన్ను ఇంతదూరమూ లాక్కొచ్చింది - ఇంకా ఎంత దూరం లాక్కుపోతుందో?

ఆమెను ముద్దు పెట్టుకున్నా - అభ్యంతర పెట్టనే లేదు. ఎంతలో ఆమెను స్వంతం చేసుకున్నాను! ఆమె మెల్లిగా జేబును తడువుతోంది - అదిరిపడ్డా. పర్సులో కాలేజీవాళ్ళకు చెల్లించాల్సిన ముడుపువుంది. దానికి ప్రమాదం సంభవిస్తే - నాక్కూడా ప్రమాదమే సంభవిస్తుంది. ఉద్రేకాన్ని బలవంతాన ఆపుకొని చూస్తున్నా. తన చెక్కిళ్ళను నాకు అందిస్తూ జేబుల్లోకి చేతిని పోనిస్తోంది. చింతామణి నాటకంలో, చింతామణి సుబ్బిశెట్టి ఉంగరాన్ని కబళించిన ఘట్టం జ్ఞాపక మొచ్చింది.

"ఏమిటీ?" అన్నా.

"మామూలు" అని చెయ్యి జేబులోకి పోనిచ్చింది.

మామూలా! ఇదేమన్నా దసరామామూలా! 'నాకు మామూలుంది - అది ఇంత - అందుకు ఇష్టమైతే - రా' అని నా కేమన్నా చెప్పిందా? పోనీ ఇంటికి ప్లీడరు బోర్డు లాటి బోర్డేమన్నా తగిలించి, దానిమీద మామూలు 'ఇంత' అని రాయించిందా? తీరా

ఇంట్లోకి వచ్చాక – 'మామూలు' అని జేబులోని బరువును తీసెయ్యటానికి ప్రయత్నించటం – ఇదేం మామూలు?

ఆమె చేతిని బైటికి నెట్టి "మామూలేంటి?" అన్నా, అమాయకాన్ని నటిస్తూ.

"మరి ఊరికనే వస్తారుటండీ?" అంది నా అమాయికానికి జాలిచూపుతూ.

"నన్ను ప్రేమించి ఆహ్వానించా వనుకున్నాను. కాని, ఇల్లాటి మామూళ్ళు సమర్పించుకునేందుకు నీ తాతల్లాటి వాళ్ళు చాలామంది ఉన్నారు–"

ఆమెకు కోపం వచ్చింది.

"ఉన్నారూ? ఉండరూ మరి? లోకంలో నాలాటి వాళ్లు లేకపోతే ఎట్లా? మీ అందాన్ని చూసి భ్రమిసిపోయి, ప్రేమించి, బొట్టూ కాటికా పెట్టి ఆహ్వానించా ననుకున్నారా? ఎంత రసికులు కాకపోతే సైకిల్‌మీద నన్ను వేటాడుతా రండీ?" విరగబడి నవ్వుతోంది.

ఏడ్చినట్టేవుంది! ఇందుకా ఈ శుభలేఖా, ఆహ్వానమూను?

"ఐతే నీ తప్పేమీ లేదంటావ్ – పోనీ, ముందెందుకు చెప్పలేదు – నాకు ఇంత కావాలని?"

"బజార్లో చెప్పుకోమంటారా? పోనీ మీ రెందుకు అడగలేదూ?"

"మరి రమ్మని పిలవ్వొచ్చా?"

"ఎవరు పిల్చారు? మీకు నేను కావాలి కనుకనే నా వెంట పడ్డారు–"

"నీకు నేను అక్కర్లేదా?"

"చాల్లేవయ్యా – ఎవరన్నా వింటే నవ్వుతారు! ఇదేనా నీ రసికత్వం? మా ఇళ్ళకు వచ్చి బేరాలు ఆడేవాళ్ళు కానీ, నీలాగ భయపడే పిరికిపందలు కానీ, పోట్లాడేవాళ్ళు కానీ – ఇంతవరకూ నా క్కనపడలేదు. ఇందుకేనా వచ్చింది?"

నేను ముడుపు చెల్లిస్తే రసికుణ్నీను, లేకపోతే యంబ్రహ్మానూనా? ఇట్లాటి 'ప్రేమ' కావాలంటే ఇంత అర్ధరాత్రి వరకూ వేచికూర్చొని – ఇంత శ్రమ పడాలా?

ఆమె ముఖం కోపాన్ని సూచిస్తోంది.

"నువ్వు వేశ్యవా?"

"కా–ను."

వేశ్యను 'వేశ్య' అంటే కూడా తప్పే కాబోలు!

"కాకపోతే నీకు డబ్బెందుకు?" అసలు విషయం ఏమైనా, క్రాస్ పరీక్షలకు దిగాను!

"మీరీవూళ్ళో ఏం చేస్తూంటారు?"

"చదువుకుంటున్నా-"

"చదు వెందుకు?"

"సంపాయించుకు తినేందుకు."

"ఆ సంపాదనకే! నేను కూడా మనిషినే కనుక నాకూ డబ్బు కావాలి. నేను కూడా మీలాటి మానవమాత్రురాల్నే కనుక, నాకూ ఆకలీ, కోరికలూ, ఒక పొట్టావున్నై. వాటిని తృప్తి పర్చుకో నక్కర్లేదూ మరి?"

"ఇది నీ వృత్తా?"2

"కా-దు."

"కాకపోతే ఏమిటీ వేటాడ్డం?"

"మీది ఏ వూరు?"

ప్రసంగం చాలా అవకతవక మార్గాల్లో పడిపోతోంది. ఈమెతో వాదించటమూ, నిద్రాభంగమూ, శృంగభంగమూకూడా కొని తెచ్చుకోవటమూ - ఇవన్నీ ఇప్పుడు కంటక ప్రాయమయ్యాయ్.

"మాదా?....పల్లె" అన్నా.

ఆమె కళ్ళను బాగా తెరిచింది.

"మీదో?" అన్నా.

"మాదీ ఆ వూరే!" అంది.

"నిన్నెక్కడో చూసిన జ్ఞాపకం - " అన్నా.

నిట్టూర్చింది. "నేను బ్రహ్మానందంగారి కుమార్తెను!"

నేను ఆశ్చర్యపొయ్యా! బ్రహ్మానందం కూతురు - దుర్గాదేవి! బీదవాళ్ళయినా పరువు మర్యాదల్తో బతికిన కుటుంబం! ఆయన ఒక కుమార్తెనూ, ఒక కుమారుణ్నీ దుఃఖసాగరంలో ముంచి పరలోకాలకు వెళ్ళిపొయ్యాడు. ఆ తరువాత వారి గతి ఏమైందో ఎవ్వరికీ తెలీదు! ఈనాటికి దుర్గాదేవి దుర్గతి తెలిసింది - నాలోని నీతీ నియమమూ మేలుకొన్నై.

"నువ్వు పతితవూ - జారిణివీ - కులటవుగా మారా వన్నమాట! శరీరాన్ని అమ్ముకొని జీవించాలని చూస్తున్నావ్. నాలాటి అమాయకుల్ని ఆకర్షించి డబ్బు గుంజటానికి వూహలు పన్నుతున్నావ్-"

"నేను మీలాగే సద్వంశంలో పుట్టాను. ఇప్పుడైతే పతితగా మారాను. ఈ సంఘమూ, వాతావరణమూ, మీలాటి అమాయకులూ కలిసి నామీద బలవంతాన విధించిన యీవృత్తిలో ఇప్పుడైతే నేను అపవిత్రురాల్నయ్యాను. ఏమైనా నాకు చేతనైన సంపాదన ఇది వొక్కటే!"

"ఇలా జబర్‌దస్తీగా డబ్బు గుంజేకన్న ఎవర్నన్నా కాళ్ళా వేళ్ళా పడితే డబ్బిస్తారు – మానాన్ని అమ్ముకొని సంపాయించవలసినంత నీచతను కొని తెచ్చుకున్న దానివి!"

"ఇది నీచ సంపాదన! కోర్టులో తప్పుడు సాక్ష్యాల్తో సంపాయించిన వారిది న్యాయమైన సంపాదన! అబలకూ, నిస్సహాయకూ సహాయం చేసే వ్యక్తులేరి? అందరూ, సమయం వస్తే నీతుల్ని ఏకరువుపెడతారు. తాము చాలా పవిత్రుల మన్నట్టు మాట్లాడుతారు. ఏదీ – ఈ దేశంలో స్త్రీ సంపాయించే వేరు మార్గాన్ని చూపండి? పతివ్రతలమని విర్రవీగేవాళ్ళనూ, లోకానికి భయపడి సిగ్గుతెరల్ని కొని తెచ్చిపెట్టుకొని ఘోషాలో కూర్చున్న స్త్రీలను – ఒక్కనాడు బైటికి పంపి సంపాయించమనండి తెలుస్తుంది. తమలాటి యువకులు లేందే – మాలాటి యువతులు తయారౌతారా? మా నీచతను, తమలాటి పవిత్రు లెందుకు ప్రోత్సహిస్తున్నారు? రోడ్డు మీద కాస్త అందమైంది కన్పిస్తే వెంటపడటం తెలుసా? బతిమాలుతాను. ప్రార్థిస్తాను – ఏదీ పట్టెడన్నం పెట్టే మహానుభావుడు? పెద్దపెద్ద ఉపన్యాస వేదికల మీదెక్కి వ్యభిచారం తప్పని డప్పుకొట్టే పెద్ద వాళ్ళందరూ – మా ఉదరగోళాల సంగతి విచారించరేం? ప్రతిఫలం కోరకుండా సహాయం చేసే ఉదార పురుషులు నా యీ ఇరవై రెండు సంవత్సరాల్లోనూ నాకు ఎదురు కానేలేదు! ఎవరిదాకానో ఎందుకు? నీతులు బోధించారే – మీరో? నాకూ నోరువుంది కనుక, మీలాగు చెప్పటం నాకూ చాతనవును. సకారణంగా వాదించే విజ్ఞానమూ, తెలివితేటలూ నాకూ వున్నై. తమరు చెప్పిన ధర్మోపదేశాలకు బద్ధురాల్ని. దాన్ని ఆచరణలో కూడా పెడతాను. పదండి – మీతో ఇంటికి వస్తాను. నన్ను పోషించండి చాలు. ఊరకనే వద్దు. నా మానభంగం మినహా మీరు చెప్పిన ప్రతిపనీ చేస్తాను. ఇల్లాటి నీచత్వానికి పాల్పడితే బైటికి గెంటండి. గుడ్డు మిటకరించు చూస్తారేం? దేశంలోని డబ్బునంతట్నీ సొంతం చేసుకున్నారనా? కార్లూ, మేడలూ, సౌందర్యమూ, అనుభవమూ, సౌఖ్యమూ – అన్నీ మీవంతూ, ఆకలీ, చింపిరిగుడ్డలూ, పాపమూ, బాధా – ఇవన్నీ మావంతూనా? సరే – ఏదీ మీరు కరుణించి నన్ను మీ దాసిగా తీసుకుపోండి చూద్దాం–"

ఆగింది. ఉద్రేకంలో ముఖమంతా ఎర్రబారింది. ఆమె ఉపన్యాసాన్ని నాగస్వరం వింటూన్న పాములాగు విన్నా. ఏం సమాధానం చెప్పను? పాపుల్ని పట్టుకుందామని బయలుదేరిన నేను, నేనూ ఒక పాపిగా తయారైనా. నాలోని నీతీ నియమమూ అన్నీ కలిసి పోట్లాడుతున్నై.

ఆమె భోరున ఏడుస్తోంది. నే నేమన్నాను? అసలెందుకు వచ్చాను?

"పోనీ మీ ఇంటికి తీసుకుపోండి-" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

తీసుకువెళ్తే ఆమె గతి నాకూ పడుతుంది! లోకంలో అందరూ నాలాటి అసహాయులేనా? లేదు! సామర్థ్యం వున్నవాళ్ళందరూ ఇలాటి పాపులకు సహాయం చేసేందుకు నిరాకరిస్తారు! అప్పుడు వారికి పాపమూ, పుణ్యమూ జ్ఞప్తికి వస్తయ్. కాని చీకటి పడంగానే అవ్వి నిద్రపోయి, ఉద్రేకమూ, సౌందర్యాన్ని అనుభవించాలనే ఆశా లేచి కూర్చుంటయ్. ఇప్పుడు అర్థమౌతోంది. లోకంలో ఇంత వ్యభిచారం ఎందుకు తయారైందో! జీవితాన్ని ఎదుర్కోవటంలో తునకలైపోయిన నీతి నియమాలు ఎవరిక్కావాలి. ఆకలి బాధకూ, అవసరానికీ, కకూర్తికీ పాల్పడే దుర్గాదేవి లాటిది దీనావస్థకు పాల్పడటంలో ఆశ్చర్యమేముందీ?

"వీల్లేదు. నేనేం సహాయం చెయ్యలేను" అన్నా - ఎల్లాగైనా తప్పించుకు బైటపడి తరువాత ఆమె మీద జాలిని కనుపరుద్దామని!

"కాని నీతులు నూరిపొయ్యగలరు. వ్యభిచారాన్ని నిరోధించే యీ పెద్దలందరకూ మా ఆకలి సంగతి అక్కర్లేదా?"

"నన్ను ఏం చెయ్యమంటావ్!"

"ఆ పర్స్‌లో డబ్బు నాకు ఇవ్వండి."

"రేపు కాలేజిలోంచి వెళ్ళగొడతారు."

"ఇంటికి రాసి మళ్ళీ తెప్పించుకోండి. సినిమాకూ, నాటకాలకూ, స్నేహితులకూ ఖర్చుపెట్టడంలా?"

తెల్లారుతోంది-పరువూ, మర్యాదా జ్ఞాపక మొస్తున్నాయ్. ఎవరి కళ్ళపడితే -నా ప్రవర్తనకు ఏం ముప్పు వస్తుందో?

ఆమె జాలి చూపులు నన్ను బెదిరిస్తున్నయ్.

"నా కడుపుకోసం చేసే యీపని నీచమన్నారుగా! ఆ నీచానికి నేను పాల్పడను - ఇవ్వండి."

మెల్లిగా జేబులో చెయ్యిపెట్టి పర్స్ లాగింది. నేను ఆమెను అడ్డుపెట్టలేక పొయ్యాను. కట్టు కట్టబడ్డ పామునై పోయా - ఆమె ముందు.

డబ్బు లెక్క చూచుకొంటోంది - కాలేజీలో జీతం కట్టని వాళ్ళ పేర్లను, బులెటిన్ బోర్డుమీద వెయ్యటం నాకూ జ్ఞాపక మొస్తోంది. ఒక్క ముద్దుకు అరవై రూపాయిలు!

"ఈ అరవై రూపాయిలూ నాకు నా తమ్ముడికీ, నాల్గు నెల్లు సరిపోతై. మీకైతే నాల్గురోజులే! ఈ నాల్గునెలల్లోనూ నే నెప్పుడన్నా రోడ్లమీద కన్పిస్తే అప్పుడు అడగండి-"

"కాని నేను రోడ్డెక్కాలి–"

"మీరా? మీకేం ఫర్వాలేదు. మీకు సంఘంలో మర్యాదా పలుకుబడీ వుంది. మీకు సహాయం చేసేవాళ్ళు చాలామంది వున్నారు. పోనీ, మీకంత గతిపడితే – నా దగ్గరకు రాండి – నాకు తెలిసిన యీవొక్క విధానాన్నీ ఉపయోగించి మీకు సంపాయించి ఇస్తా–"

నా కోసం మానాన్ని అమ్మేవ్యక్తి! చాలు – ఇంత కృతజ్ఞతకు ఏమిస్తే సరిపోతుంది? ఆనందబాష్పాలు రాలాయ్.

లేచి నిలబడ్డా –

"వెళ్ళి వస్తా–"

"కృతజ్ఞతాపూర్వక వందనాలు –"

నమస్కరించింది.

మెల్లిగా బైటపడ్డా. ఆనాడు నేర్చుకున్న యీపాఠపు విలువ – అరవై రూపాయిలు!

*– జనవరి, 1941*